క్లుప్తంగా

నిత్యావసర సరుకుల పంపిణీ



వత్సవాయి: ఓలమ్ కంపెనీ ఆధ్వర్యంలో మండలంలోని వత్సవాయి, వేమవరం, కంభంపాడు గ్రామాలలోని 100 మంది మహిళా కూలీలకు కంపెనీ ఆధ్వర్యంలో నెలకు సరిపడా నిత్యావసర సరుకులను అందించారు. వత్సవాయిలో సర్పంచ్ భూక్యా సీతమ్మ చేతుల మీదుగా వీటిని అందజేశారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ కంపెనీ తరుపున ప్రతి సంవత్సరం వేసవికాలంలో కూలీలకు నెలకు సరిపడా సరుకులు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు కె.సురేష్ కృష్ణ, ఎస్. నరసింహరావు, సురేష్‌బాబు, గ్రామస్తులు భూక్యా రాజానాయక్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళం అందజేత



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి ఆదివారం బాపట్ల జిల్లా రేపల్లె పట్టణానికి చెందిన చింత కగపతిరావు, సుమ దంపతులు రూ.11,111 ఆలయ ఈఓ లీలాకుమార్, చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేష వస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

శిలువ గిరి మహోత్సవాలు ప్రారంభం



నందిగామ: సిలువ గిరి పుణ్యక్షేత్ర తిరుణాల మహోత్సవాలు ఆదివారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు జరిగే మహోత్సవాల్లో భాగంగా మొదటిరోజు క్రీస్తు స్వస్థత ప్రార్థనలు, సమిష్టి దివ్యబలి పూజ నిర్వహించారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. రాత్రి పొద్దుపోయే వరకు కొనసాగిన ఆయా కార్యక్రమాలకు పలు గ్రామాల నుంచి విశ్వాసకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వేగంగా రహదారి విస్తరణ పనులు



నందిగామ: పట్టణంలోని చందర్లపాడు రహదారి విస్తరణ పనులు వేగంగా సాగుతున్నాయి. గాంధీ సెంటర్ నుంచి చందాపురం ఫ్లై ఓవర్ వరకు ఉన్న రెండు కిలోమీటర్ల రహదారిని విస్తరిస్తున్నారు. ప్రస్తుతం 24 అడుగులు ఉన్న రహదారిని 60 అడుగులకు పెంచనున్నారు. సుమారు రెండు కోట్లకు పైగా సోషల్ కంట్రిబ్యూషన్ ఫండ్ ద్వారా ఈ రహదారి అభివృద్ధి చేస్తున్నారు. ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్ చొరవతో ఈ పనులు చకచకా సాగుతున్నాయి. సుమారు 45 రోజుల్లో రహదారి పూర్తిగా అభివృద్ధి చేస్తామని అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో విస్తరణ పనులు నిర్విరామంగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే పట్టణంలోని సీఎం రోడ్ విస్తరణ పనులు పూర్తయిన నేపథ్యంలో మిగిలిన ప్రాంతాల్లోని రహదారులూ ఆ తరహాలో అభివృద్ధి చేస్తున్నారు.

తిరునాళ్లకు ప్రత్యేక ఏర్పాట్లు



పెనుగంచిప్రోలు: స్థానిక శ్రీతిరుపతమ్మవారి చిన్న తిరునాళ్ల ఉత్సవాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టినట్లు సర్పంచ్ వేల్పుల పద్మకుమారి తెలిపారు. ఆదివారం రోడ్డుకు ఇరువైపులా చెత్త, కంప చెట్లు తొలగించటంతో పాటు మునేరు అవతల డ్రోజర్, జేసీబీ సాయంతో చెట్లు తొలగించారు. మేటవేసిన ఇసుక రోడ్డు పక్కకు తరలించారు. మురుగు కాలువలు శుభ్రం చేసి, బ్లీచింగ్ చల్లిస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ, పంచాయతీ కార్యదర్శి శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట

ప్రభుత్వ విప్ ఉదయభాను



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముదిరాజ్‌ల అభ్యున్నతికి పెద్ద పీట వేస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. ఆదివారం స్థానిక మిట్టగూడెంలోని జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్ సమీపంలో ఉన్న ముదిరాజ్ సంఘం కమ్యూనిటీ హాల్‌లో జరిగిన ఆంధ్రప్రదేశ్ ముదిరాజ్ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మత్స్యకార భరోసా ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్క కుటుంబానికి రూ.10 వేలు అందజేస్తున్నామని తెలిపారు. జగ్గయ్యపేటలో ముదిరాజ్‌ల భవన్ ఏర్పాటుకు తన వంతు సహాయ సహకారాలు అందజేశామన్నారు. ముదిరాజ్ భవనం చుట్టూ ప్రహరీ నిర్మాణానికి కూడా సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఇంకా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ముదిరాజ్ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు చప్పిడి కృష్ణమోహన్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఒక్క జగ్గయ్యపేట లోనే ఎమ్మెల్యే ఉదయభాను సహకారంతో భవనాన్ని ఏర్పాటు చేసుకోవడం సంతోషదాయకమన్నారు. ఈ సందర్భంగా ఉదయభానుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నియోజకవర్గ యువనేత సామినేని వెంకట కృష్ణప్రసాద్, కౌన్సిలర్ దువ్వల రమాదేవి రామకృష్ణ, మాజీ కౌన్సిలర్ నీలం నరసింహారావు, ముదిరాజ్ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు తేనె కృష్ణసులోచన, ఉద్యోగుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పులి శ్రీనివాస్, రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులు కొంగితాల లక్ష్మీపతి, సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కాటుబోయిన గురునాథం, కార్యవర్గ ప్రతినిధులు గరిగంటి చెన్నయ్య, అర్వపల్లి నరసింహారావు, కోటయ్య, నాగేంద్రం, కాశయ్య తదితర సంఘ నాయకులు, పెద్దలు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో ముందుండాలి



ఆజాద్ ముస్లిం కమిటీ సభ్యులకు గుర్తింపు కార్డులు అందజేస్తున్న నాగుల్ మీరా

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆజాద్ ముస్లిం కమిటీ సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండాలని ఆ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు షేక్ నాగుల్ మీరా పిలుపునిచ్చారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆజాద్ ముస్లిం కమిటీ సమావేశం జరిగింది. రాష్ట్ర సహాయ కార్యదర్శి సయ్యద్ మౌలాలి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రంజాన్‌లో తమ నియోజకవర్గాల్లోని పేద ముస్లింలకు చేయూతనందించాలన్నారు. సేవా కార్యక్రమాలతో పాటు ముస్లిం మైనార్టీలు నివసించే ప్రాంతాల్లో పర్యటించి వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. సమస్యలపై పోరాటంలోనూ, రాజకీయాల్లో, సేవా కార్యక్రమాల్లో ఆజాద్ కమిటీ అగ్రభాగాన నిలవాలన్నారు. అనంతరం నూతన కమిటీల నియామకం చేశారు.ఆజాద్ ముస్లిం కమిటీ కృష్ణాజిల్లా అధ్యక్షులుగా అబ్దుల్ అజ్మతుల్లా, ఎన్టీఆర్ జిల్లా సోషల్ మీడియా అధ్యక్షులుగా షేక్ షాకిర్, పల్నాడు జిల్లా అధ్యక్షులుగా అబ్దుల్ అజీజ్, విజయవాడ నగర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్, నగర ఉపాధ్యక్షులుగా షేక్ రఫీ లను నియమించారు. వారికి రాష్ట్ర అధ్యక్షులు షేక్ నాగుల్ మీరా నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆజాద్‌ముస్లిం కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సాజిద్ అలీ(హఫీజ్), రాష్ట్ర ఉపాధ్యక్షులు అబ్దుల్ అజ్మతుల్లా, సెంట్రల్ ఇన్‌చార్జి మహమ్మద్ కాలేషా, రాష్ట్ర సహాయ కార్యదర్శి సయ్యద్ మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

నేడు స్పందన

నందిగామ: పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహిస్తామని ఆర్డీవో రవీంద్రరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యలపై ప్రజలు అర్జీలు అందించవచ్చని చెప్పారు.

కంచికచర్ల: ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం సోమవారం ఉదయం 10 గంటల నుంచి జరుగుతుందని తహసీల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి ఆదివారం తెలిపారు. గ్రామాల్లో సమస్యలుంటే పరిష్కరించటానికి అర్జీలు అందించాలని తెలిపారు. ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామన్నారు.

అమ్మవారి దర్శనానికి తరలివచ్చిన భక్తులు



పెనుగంచిప్రోలు: స్థానిక శ్రీతిరుపతమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సెలవు దినం, పలు శుభ కార్యాలు ఉండటంతో పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. దీంతో ఆలయ పరిసరాలు కిక్కిరిశాయి. భక్తులు అమ్మవారికి పాలు, పొంగళ్లు సమర్పించుకున్నారు. మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పోలీస్ వారు బందోబస్తు నిర్వహించారు.

రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతున్న సీఎం జగన్

ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్సీ రుహుల్లా

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): విశాఖలో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ ద్వారా జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులకు ఏపీ కేంద్ర బిందువుగా మారిందని, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రముఖ దిగ్గజ కంపెనీలన్నీ సముఖత చూపాయంటే దానికి కారణం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా అన్నారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ విజయవంతం కావడంతో సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటర్‌లోని ఎమ్మెల్సీ కార్యాలయం ఎదుట ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి ఆదివారం క్షీరాభిషేకం చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని సంక్షేమ పథం, అభివృద్ధి పథంలో నడిపించే సత్తా ఉన్న గొప్పవ్యక్తి మనకు ముఖ్యమంత్రిగా రావడం అదృష్టమన్నారు. గత టీడీపీ హయంలో ఎంఓయూలు తప్పించి, ఎక్కడా అభివృద్ధి కనిపించలేదని కేవలం ప్రచారానికి మాత్రమే చంద్రబాబు పని చేశాడని విమర్శించారు. జగనన్న సంక్షేమ పాలన చూసిన ప్రఖ్యాతిగాంచిన కంపెనీల అధినేతలు స్వయంగా ఈ సమ్మిట్‌లో పాల్గొని తమ పెట్టుబడులు వివరించడం చారిత్రాత్మకమన్నారు. రాష్ట్రానికి తరలివస్తున్న పారిశ్రామిక వేత్తలు, పరిశ్రమలను చూసి ఓర్వలేని చంద్రబాబు, ఎల్లో మీడియా దీనిపై కూడా విషప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. బాధ్యతగల మీడియా రంగంలో ఉండి కూడా కొన్ని పచ్చ మీడియాలు రాష్ట్ర ప్రతిష్టతను దిగజార్చేలా రాతలు రాయడం నీచమైన సంస్కృతి అని, వీరికి ప్రజలు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. రాష్ట్రాన్ని పురోగతి వైపు నడిపిస్తున్న జగనన్నే మళ్లీ మళ్లీ ముఖ్యమంత్రిగా రావాలని రాష్ట్ర ప్రజలంతా కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో 59వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ షాహీనాసుల్తానా, కోఆప్షన్ సభ్యులు సయ్యద్ అలీమ్, వైఎస్సార్ సీపీ నాయకులు ఎండీ హఫీజుల్లా, నందెపు సురేష్, చింతా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జగన్‌తోనే రాష్ట్రంలో ముస్లిం మైనార్టీలు

షేక్ ఆసిఫ్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలోని ముస్లిం మైనార్టీలు కొనసాగనున్నారని ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ ఆసిఫ్ అన్నారు. వక్ఫ్‌బోర్డు జిల్లా పాలకవర్గం డైరెక్టర్‌గా నియమితులైన మహ్మద్ అబిద్.. ఆసిఫ్‌ను ఆయన కార్యాలయంలో ఆదివారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆసిఫ్‌ను అబిద్ సత్కరించారు. ఆసిఫ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ముస్లిం మైనార్టీల సంక్షేమానికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందన్నారు. వివిధ నామినేటెడ్ పదవుల్లో ముస్లింలకు అత్యధిక ప్రాధాన్యమిస్తూ రాజ్యాధికారంలో భాగస్వాములను చేసిన ఘనత జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చూడాలని ముస్లిం మైనార్టీలు విశ్వసిస్తున్నారని వివరించారు.

‘సార్’ సినిమాకు ప్రత్యేక రాయితీ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ధనుష్ నటించిన 'సార్' సినిమా ప్రేక్షకాదరణ పొందిందని, చిత్ర సందేశాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులకు అందించాలనే ఉద్దేశంతో సినిమా ప్రదర్శనపై ప్రత్యేక రాయితీ కల్పిస్తున్నట్లు జేపీఆర్ ఫిల్మ్స్ అధినేత, సినిమా డిస్ట్రిబ్యూటర్ డాక్టర్ పవన్ కుమార్ తెలిపారు. ఆదివారం ఫిల్మ్ చాంబర్ హాల్లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోనై ఆత్మహత్యలకు పాల్పడటం విచారకరమన్నారు. సార్ సినిమాలో విద్యార్థులు, ఉపాధ్యాయుల మధ్య బంధాన్ని హృదయానికి హత్తుకునేలా చిత్రీకరించారన్నారు. సినిమా చూసేందుకు విద్యార్థులు ముగ్గురు కన్నా ఎక్కువ మంది థియేటర్‌కు వస్తే ఒక టికెట్ పై మరో టికెట్ ఉచితంగా అందిస్తామన్నారు. 50 మంది విద్యార్థులు ఏదైనా ఒక విద్యా సంస్థ నుంచి వస్తే ఒక టికెట్‌పై ఇద్దరికి ఉచితంగా సినిమా చూసే అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. స్కూల్ మేనేజ్‌మెంట్ కోరితే వారికోసం ప్రత్యేకంగా ఒక షో ప్రదర్శిస్తామన్నారు. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో 'సార్' సినిమా ప్రదర్శిస్తున్న అన్ని థియేటర్లలో ఈ రాయితీ పొందవచ్చని తెలిపారు. వివరాలకు 97051 61908లో సంప్రదించాలన్నారు. / సమావేశంలో సాయిరాం స్క్రీన్స్ 'అధినేత వినీత్‌సాయి, సురేష్ మూవీస్ డిస్ట్రిబ్యూటర్ మేనేజర్ భగవాన్ పాల్గొన్నారు.

ఠాగూర్ గ్రంథాలయానికి పుస్తకాలు, క్రీడా పరికరాలు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అయ్యంకి వెంకట రమణయ్య స్మారకార్థం ఆయన మనువడు సరస్వతి సామ్రాజ్యం అధ్యక్షులు అయ్యంకి మురళీకృష్ణ.. ఠాగూర్ గ్రంథాలయానికి క్రీడా పరికరాలు, పుస్తకాలు అందజేశారు. ఆదివారం ఠాగూర్ గ్రంథాలయంలో అయ్యంకి వెంకట రమణయ్య 44వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. అయ్యంకి విగ్రహానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ జమల పూర్ణమ్మ నివాళులర్పించారు. ఈ సందర్భంగా జమల పూర్ణమ్మ మాట్లాడుతూ గ్రంథాలయాల అభివృద్ధికి అయ్యంకి చేసిన సేవలను కొనియాడారు. పరికరాలు అందజేసిన మురళీకృష్ణను ప్రత్యేకంగా అభినందించారు. గ్రంథాలయాధికారిణి రమాదేవి, సునీత, రమేష్, జగదీష్ తదితరులున్నారు.

జగనన్న ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాల్టీ పరిధిలో నిర్మాణంలో ఉన్న జగనన్న ఇళ్ల నిర్మాణాలపై హౌసింగ్ డీఈ నాగమల్లేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఆదివారం సమీక్ష జరిపారు. అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలపై తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. ఇళ్లు పూర్తయిన లేఅవుట్‌లలో మౌలిక సదుపాయాల కల్పన, పెండింగ్ బిల్లుల చెల్లింపులపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతిఒక్కరూ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం అయ్యేందుకు కృషి చేయాలని సూచించారు.



పెన్షనర్లు ధ్రువీకరణ పత్రాలు అందించాలి




కంచికచర్ల: ప్రభుత్వ పెన్షనర్స్ తప్పనిసరిగా తమ జీవన ధ్రువీకరణ పత్రాలు ఈ నెల 20వ తేదీ లోగా అందజేయాలని విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు సానె రామమోహన్‌రావు తెలిపారు. రిటైర్డ్ ఎంప్లాయీస్ సంఘ కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ పెన్షనర్స్ తప్పనిసరిగా జీవన సర్టిఫికెట్ ఇచ్చేందుకు కంచికచర్ల ఉప ఖజానా కార్యాలయ అధికారిని సంప్రదించాలని సూచించారు. కంచికచర్ల, వీరులపాడు మండలాల్లోని రిటైర్డ్ ఎంప్లాయీస్ అందరూ విధిగా సమర్పించాలని కోరారు. సంఘ కార్యదర్శి ముండ్లపాటి పోతరాజు, కోశాధికారి చలసాని నాగేశ్వరరావు, పెద్దినీడి కోటేశ్వరరావు, సీహెచ్ స్వర్ణలత, బీవీ సర్వేశ్వరరావు, షేక్ జానిమియా తదితరులు పాల్గొన్నారు.

9న శిఖర కలశ పునఃప్రతిష్టా మహోత్సవం

కంచికచర్ల: స్థానిక అంకమ్మతల్లి, మద్దిరావమ్మ, పోతురాజు శిఖర కలశ పునఃప్రతిష్టా కార్యక్రమం ఈ నెల 9వ తేదీన అత్యంత వైభవంగా జరుగుతుందని ఆలయ అర్చకులు కాకాని పవన్‌కుమార్ ఆదివారం తెలిపారు. శిఖర ప్రతిష్టా కార్యక్రమాలు మూడు రోజుల పాటు నిర్వహిస్తామని పేర్కొన్నారు. 7వ తేదీన విఘ్నేశ్వర పూజ, వేదపారాయణ, అనుజ్ఞ ప్రతిష్టా సంకల్పం, పుణ్యాహవచనం, పంచగవ్య స్థాపన, దీక్షాధారణ మంత్ర పుష్పాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. 8వ తేదీన శాంతి కుంభా వాహన క్షీరాధీవాసం, జలాధివాసం, వాస్తుపూజ, అధివాసహోమాలు, వాస్తు హోమం, వాస్తు బలి పర్యగ్నీకరణం, ఆదివాస పూజ, హారతి, మంత్ర పుష్పం, తీర్థప్రసాద వినయోగం జరుగుతాయన్నారు. 9వ తేదీన శిఖర పునఃప్రతిష్ఠ మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయని అనంతరం మధ్యాహ్నం అన్న సమారాధన ఉంటుందని అర్చకులు తెలిపారు.

విశ్వనాథం విగ్రహానికి పలువురి నివాళి



సర్దార్ సామినేని విశ్వనాథం విగ్రహానికి నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట మేజర్ పంచాయతీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు సర్దార్ సామినేని విశ్వనాథం విగ్రహం ఆవిష్కరణ సందర్భంగా ఆదివారం నియోజకవర్గ వ్యాప్తంగా పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆవిష్కరించిన ఆయన విగ్రహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ అభివృద్ధికి విశ్వనాథం చేసిన కృషిని కొనియాడారు. పెనుగంచిప్రోలు మేజర్ పంచాయతీ సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, పార్టీ రాష్ట్ర నాయకుడు వేల్పుల రవికుమార్, జగ్గయ్యపేట పట్టణ, మండలం, వత్సవాయి, పెనుగంచిప్రోలు,నందిగామ మండలంలోని ఏటి పట్టు గ్రామాల అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, చిలుకూరి శ్రీనివాసరావు, గాదెల రామారావు, ఊట్ల నాగేశ్వరరావు, దేవినేని రామారావు, పట్టణ, మూడు మండలాల మండల సమాఖ్య అధ్యక్షులు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

విశ్వనాథం కుటుంబ సభ్యుల నివాళి..

పేట మాజీ సర్పంచ్ సర్దార్ సామినేని విశ్వనాథం విగ్రహం ఆవిష్కరణ సందర్భంగా విశ్వనాథం కుమారులు ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, ఆయన సతీమణి సామినేని విమలాభాను, పారిశ్రామికవేత్త సామినేని రవిచంద్, సతీమణి రమా, కుమార్తెలు ఉదయశ్రీ, జయశ్రీ, చాముండేశ్వరి తదితరులు నివాళులర్పించారు.

పార్టీ శ్రేణులు..

ఏఎంసీ చైర్మన్ ఎం.విజయశేఖర్, మున్సిపల్ వైస్ చైర్మన్లు తుమ్మల ప్రభాకర్, హఫీజున్నీసా, మున్సిపల్ మాజీ చైర్మన్ ఇంటూరి చిన్నా, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, డాక్టర్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు మెహబూబ్, బొమ్మదేవర సుబ్బారావు, విశ్వనాథం కుటుంబ సభ్యులు, పేట పట్టణం, రూరల్, వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాలు, నందిగామ ఏడిపట్టు గ్రామాల అధ్యక్షులు, మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బీజేపీ హయాంలో వ్యవసాయ రంగం నిర్వీర్యం

వీరులపాడు: బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా సంపదను పెట్టుబడిదారులు, కార్పొరేట్లకు దోచి పెడుతుందని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి చనుమోలు సైదులు తెలిపారు. వీరులపాడులోని కార్మిక సంఘ కార్యాలయంలో సీఐటీయూ మండల కార్యదర్శి గౌస్ అధ్యక్షతన ఆదివారం ప్రజా సంఘాల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 65 శాతం మంది ప్రజలు ఆధారపడిన వ్యవసాయ రంగాన్ని మోడీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక, రైతు హక్కులను కాలరాసేలా కేంద్ర ప్రభుత్వం పని చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్ మాట్లాడుతూ ఏప్రిల్ 15 వరకు సాగర్ జలాలు అందించాలని కోరారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ, తదితర డిమాండ్‌లను పరిష్కరించాలని కోరుతూ ఏప్రిల్ ఐదున చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్మికులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు వట్టికొండ పార్థసారథి, వట్టికొండ రమేష్, పల్లెకంటి బాబు, చాట్ల రవి, ప్రభాకర్, ఆనందరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

7న లక్ష్మీ జయంతి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): లక్ష్మీ జయంతి పురస్కరించుకుని ఈ నెల 7వ తేదీ మంగళవారం చిట్టినగర్‌లోని శ్రీమహాలక్ష్మి కల్యాణ మండపంలో విశేష అభిషేకాలు, అర్చనలు చేయనున్నట్లు విఖనస సేవా సమాఖ్య సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 6వ తేదీ సోమవారం సాయంత్రం విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, మేదినీ పూజ జరగనున్నాయని తెలిపారు. మంగళవారం నవగ్రహారాధన, హోమం, సామూహిక కుంకుమార్చన, విశేష అభిషేకాలు, అర్చనలు జరుగుతాయని పేర్కొన్నారు. విశిష్ట అతిథి చిన ఆగిరిపల్లి రేణుకా క్షేత్రం పీఠాధిపతి వీర కృష్ణ భవానీతో లక్ష్మీ ప్రవచనం ఉంటుందని తెలిపారు. ఉత్సవ ఏర్పాట్లు చేస్తున్నట్లు కొత్త అమ్మవారి దేవస్థాన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు లింగిపిల్లి అప్పారావు, మరుపిళ్ల హనుమంతరావు పేర్కొన్నారు.

అకట్టుకున్న నృత్యాభినయం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధర్మపథంలో భాగంగా ఆదివారం ఇంద్రకీలాద్రిపై పలువురు విద్యార్థుల కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం ఎదుట కళావేదికపై శ్రీఅరుణ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీకి చెందిన కళాకారులు చక్కటి అభినయంతో నృత్య ప్రతిభను ప్రదర్శించారు. కళాకారులకు ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించిన అనంతరం ప్రసాదాలను అందజేశారు.

రేపు నెమలిలో పౌష్టికాహార స్టాల్ ఏర్పాటు

నెమలి(గంపలగూడెం): నెమలి శ్రీ వేణుగోపాల స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం పౌష్టికాహార స్టాల్ నిర్వహించనున్నట్లు తిరువూరు సీడీపీఓ సత్యవతి తెలిపారు. తక్కువ ఖర్చుకు ఎక్కువ పోషకాలు ఉన్న ఆహార పదార్థాల తయారీపై ప్రజల్లో అవగాహన కల్పించే విధంగా స్టాల్ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. మహిళలు ఎవరైనా పోషకాహారాన్ని తయారు చేసి స్టాల్‌లో ప్రదర్శించవచ్చని తెలిపారు.

అచ్చం పేరంటాళ్లమ్మ జాతరకు ఏర్పాట్లు

పేరంటాళ్లగుట్ట(గంపలగూడెం): వినగడప శివారు పేరంటాళ్లగుట్ట వద్ద విరాజిల్లుతున్న అచ్చం పేరంటాళమ్మ ఆలయంలో మంగళ, బుధవారాల్లో జాతర నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ మేచినేని నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు కొనసాగించారు. మంగళవారం ఉదయం అచ్చం పేరంటాళమ్మ అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు గావిస్తారు. రాత్రికి వినగడప పెద్దకాపు ఇంటి వద్ద నుంచి గ్రామ రాశి ప్రభను ప్రారంభించి గ్రామంలోని ప్రధాన వీధుల్లో బాజాభజంత్రీలతో ఊరేగిస్తారు. బుధవారం ఉదయానికి ప్రభ ఆలయం వద్దకు చేరుకుంటుంది. తదుపరి జాతర ఉత్సవాలను నిర్వహిస్తారు. పలు మండలాల నుంచి భక్తులు ఇక్కడకు విచ్చేస్తారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ చైర్మన్ నాగమల్లేశ్వరరావు తెలిపారు.

7నుంచి తిరుపతమ్మ ఆలయంలో బోనాలు

బొర్రగూడెం(మైలవరం): మైలవరం మండలం చంద్రగూడెం శివారు బొర్రగూడెం గ్రామంలో వేంచేసియున్న తిరుపతమ్మ గోపయ్యస్వామి వార్ల నెల బోనాల ఉత్సవాలు మంగళవారం నుంచి శనివారం వరకు ఐదు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి మోహనరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 7న కాకినాడ వారిచే వెరైటీ బుర్రకథ, 8న రాత్రి కల్లూరు వారిచే పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి చరిత్ర, 9న రాత్రి గుడివాడ వారిచే సత్య హరిశ్చంద్ర నాటకం, 10న విజయావాడ, గుడివాడ వారిచే భక్తి పాటలు, 11న రాత్రి చంద్రగూడెం వారిచే కోలాటం కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.